సాక్షి
నిజామాబాద్
శనివారం, 10, ఫిబ్రవరి, 2024



లోకోస్ యాప్‌లో లోపాలు

లోకోస్ యాప్‌లో సాంకేతిక సమస్యతో మహిళా సంఘాల సభ్యుల వివరాల నమోదులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

- 10లో ▸



విద్యార్థినులకు అస్వస్థత

తెయూ హాస్టల్ విద్యార్థినులు ముగ్గురు పరీక్షలు రాస్తూ అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.1 /18.5

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతం అవుతుంది. ఎండ వేడిమి కాస్త పెరిగే అవకాశం ఉంది. రాత్రి చలి తీవ్రత తగ్గవచ్చు.

న్యూస్‌రీల్

పీవీ సేవలను ప్రభుత్వం గుర్తించింది

సుభాష్‌నగర్: ప్రధానమంత్రిగా పీవీ నర్సింహారావు దేశానికి చేసిన సేవలను గుర్తించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారతరత్న ప్రకటించిందని ఎంపీ అర్వింద్ ధర్మపురి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పీవీ నర్సింహారావును విస్మరించిందని, ఆయన మరణానంతరం అవమానించిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పీవీకి భారత రత్నను ప్రకటించినందుకు ఎంపీ ధన్యవాదాలు తెలియజేశారు.

పీవీకి 'భారతరత్న' సంతోషకరం



నిజామాబాద్ సిటీ: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం సంతోషకరమని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఇందూరు శాఖ ప్రధాన కార్యదర్శి రొట్టె సురేష్ శర్మ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బోర్గాం(పీ) చౌరస్తాలో గల పీవీ విగ్రహానికి పాలభిషేకం చేశారు. పుల్కల్ రమేష్, కులకర్ణి రాజ్, లక్ష్మీనారాయణ భరద్వాజ్, రమేష్ కులకర్ణి, లక్ష్మణ్, వైరాగర్ హనుమంత్ రావు, లక్ష్మీకాంతారావు, మంచికంటి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

పిల్లల కిడ్నాప్ వదంతులు నమ్మొద్దు

ఖలీల్‌వాడి: పిల్లల కిడ్నాప్‌లపై సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దని సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో ఎలాంటి కిడ్నాప్‌లు జరగడం లేదని పేర్కొన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి




సుభాష్‌నగర్: ఎల్లారెడ్డి–రుద్రూర్ సెక్షన్‌లో రోడ్డు విస్తరణకు సంబంధించి అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, సకాలంలో పనులు పూర్తయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో శుక్రవారం ఆయన ఎన్‌హెచ్–765 డి పరిధిలోని ఎల్లారెడ్డి–రుద్రూర్ సెక్షన్‌లో రోడ్డు వెడల్పు పనులపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. విస్తరణ పనుల కోసం వర్ని వద్ద 9.4638 హెక్టార్ల అటవీ భూమిని మళ్లించాల్సి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. భూమిని సేకరించడంలో సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి వికాస్ మీనా, ఎకో–టూరిజం ఈడీ రంజిత్ నాయక్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగోరావు, ఈ–సెక్షన్ సూపరింటెండెంట్ వేణు పాల్గొన్నారు.

ఖరీదైన బైకులే టార్గెట్..

కామారెడ్డి క్రైం: ఖరీదైన బైకులను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్న ఓ ముఠాను కామారెడ్డి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సింధు శర్మ వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో తరచుగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయి. ఇటీవల పట్టణంలోని ఓ వ్యక్తికి చెందిన బుల్లెట్ బైక్ చోరీ కావడంతో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. సీసీ పుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా విచారణ చేపట్టారు. శుక్రవారం నిజాంసాగర్ చౌరస్తాలో ఓ బైక్‌పై ముగ్గురు వెళ్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అడ్డుకుని విచారించారు. తామే బైక్ చోరీలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. నిందితులను మాక్లూర్ మండలం బొంకన్‌పల్లికి చెందిన నిజాంపూర్ శశాంక్, ఏర్గట్ల సందీప్, షేక్ అహ్మద్‌లుగా గుర్తించారు. వారి నుంచి మొత్తం 29 బైకులను రికవరీ చేశారు. వాటిలో 12 బుల్లెట్‌లు, 12 పల్సర్ బైక్‌లే కావడం గమనార్హం. బైక్‌లను నిజామాబాద్, నాందేడ్ తదితర ప్రాంతాల్లోని చిన్నచిన్న గ్రామాల్లో విక్రయించినట్లు విచారణలో తేలింది. బైక్‌లకు సంబంధించి కామారెడ్డిలో 12, బాన్సువాడలో 4, నస్రుల్లాబాద్ పీఎస్‌లో ఒకటి, నిజామాబాద్ టౌన్‌లో 2, రూరల్‌లో 2, వేల్పూర్‌లో 2, మోర్తాడ్, ఇందల్‌వాయి, ఆర్మూర్, కమ్మర్‌పల్లి పీఎస్‌లలో ఒక్కో కేసు నమోదయ్యాయని ఎస్పీ తెలిపారు.

అక్రమాల పుట్ట!



- వెలుగులోకి వస్తున్న జిల్లా మాజీ సహకార అధికారి సింహాచలం వ్యవహారాలు
- పడగల్ సొసైటీలో 773 బస్తాలకు 100 బస్తాల కడ్తా..
- గతంలో పనిచేసిన సొసైటీ ఛైర్మన్లను వేధించిన వైనం
- మాజీ డీసీవో నిర్వాకంతో దివాలా తీసిన పలు సొసైటీలు
- అవినీతి ఆరోపణలతో బదిలీ చేసిన ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సుమారు ఎనిమిదేళ్ల సుదీర్ఘ కాలం జిల్లా సహకార అధికారిగా.. ఇటీవలి వరకు పనిచేసి బదిలీ అయిన సింహాచలం రూ.కోట్ల అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు పలు విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భావించగా.. అకస్మాత్తుగా సింహాచలంను బదిలీ చేయడంతో సేఫ్‌గా బయటపడినట్లు పలువురు పేర్కొంటున్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి అతను చేసిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు గట్టిగా వస్తున్నాయి.

జిల్లా అధికారిగా కాకుండా రాజకీయ కక్షసాధింపు చర్యగా, కార్యకర్త మాదిరిగా సింహాచలం వ్యవహరించినట్లు రైతులు గుర్రుగా ఉన్నారు. సింహాచలం వ్యవహరించిన తీరు చూస్తే విస్తుగొలిపే అంశాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

రూ. కోట్ల అవినీతి..

వేల్పూర్ మండలం పడగల్ సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రంలో 773 బస్తాల ధాన్యానికి సంబంధించి ఒకసారి కడ్తా తీశారు. తర్వాత మళ్లీ మిల్లర్ల కోసం ఏకంగా 100 బస్తాల కడ్తా తీసినట్లు సింహాచలం అందరూ విస్తుపోయేలా ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన మహిళా రైతుకు సమాధానం ఇవ్వడం గమనార్హం. మిల్లర్లతో కుమ్మక్కై ఒక్క సొసైటీ కొనుగోలు కేంద్రం నుంచే ఈ స్థాయిలో అవినీతికి పాల్పడిన అంశం చర్చనీయాంశమైంది. ఇలా జిల్లాలోని అనేక సొసైటీల్లో ఇతర అనేక అంశాల్లో ఏ స్థాయిలో అవినీతికి పాల్పడ్డారో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి నేపథ్యంలోనే ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ సొసైటీ దివాలా తీసింది. రూ. కోట్లలో డిపాజిట్లు చేసిన రైతులకు తిరిగి చెల్లించలేని దుస్థితి నెలకొంది. చెప్పుకుంటూ పోతే అవినీతి, అక్రమ వ్యవహారాలు కోకొల్లలుగా వెలుగులోకి వస్తున్నాయి. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఫిర్యాదులు వెళ్లడంతో బదిలీ వేటు వేసి ఇప్పటివరకు పోస్టింగ్ ఇవ్వలేదు. అయితే కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మచ్చుకు కొన్ని లీలలు..

- సహకార సంఘాల కొనుగోలు కేంద్రాలకు వచ్చిన కమీషన్‌ను నెలల తరబడి బ్యాంకులో సేవింగ్ ఖాతాల్లో ఉంచి వడ్డీని వాడుకుని బొక్కేసినట్లు తెలుస్తోంది.
- సంఘాల ఎన్నికల కోసం సంఘాల నుంచి సేకరించిన డబ్బును దుర్వినియోగపరిచినట్లు రాష్ట్ర సహకార ఆడిట్ అధికారులు నిర్ధారించారు.
- ఎన్నికల నిర్వహణ కోసం సేకరించిన డబ్బును భీమ్‌గల్ మున్సిపాలిటీలో చెత్త వాహనాల కొనుగోలుకు చెల్లించారు. అది చట్టవిరుద్ధం.
- ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైస్ మిల్లర్లు అక్రమంగా తీసుకున్న తరుగులో సింహాచలం కీలక పాత్ర పోషించారు.
- జిల్లా సహకార అధికారి 2018–19లో సహకార ఎన్నికల కోసం సంఘాల నుంచి సేకరించిన నిధులను సివిల్ సప్లయ్ వారికి ఇచ్చినట్లు సహకార ఆడిట్ అధికారుల నివేదికలో పేర్కొన్నారు. అయితే నిధులను సివిల్ సప్లయ్ వారికి ఇచ్చే అధికారం జిల్లా సహకార అధికారికి లేదు. రైతుల సహకార సంఘాల నిధులను డీసీవో కానీ, జిల్లా కలెక్టర్ కానీ ఇష్టానుసారం ఇతరాలకు చెల్లింపులు చేయడం చట్టవిరుద్ధం. ఇదిలా ఉండగా ఈ విషయమై సివిల్ సప్లయ్ వారు మాత్రం సహకార అధికారి నుంచి తమకు నిధులు అందలేదని సమాచారహక్కు చట్టం కింద సమాచారం ఇచ్చారు.
- డీసీవోకు సంబంధించి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రిపోర్టులో అనేక లోపాలను ఎత్తిచూపారు. ఇవి చాంతాడంత అయ్యేలా ఉన్నాయి. డీసీవోగా పనిచేసిన సింహాచలం అవినీతి విషయమై వదిలిపెట్టేది లేదని జిల్లాలోని ఎమ్మెల్యేలు చెబుతున్నారు. ఈ విషయాలపై వివరణ కోసం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును వివరణ కోరే ప్రయత్నం చేయగా స్పందించలేదు.

'ఆర్మూర్ అవిశ్వాసం'లో ట్విస్ట్

- ఛైర్‌పర్సన్‌పై తీర్మానం నెగ్గినట్లు ప్రకటించిన హైకోర్టు
- వైస్ ఛైర్మన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలని ఆదేశం
- ఈ నెల 19లోగా ఎన్నిక నిర్వహించాలంటూ ఉత్తర్వులు



ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపాలిటీలో ఛైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం రోజుకో మలుపు తిరుగుతోంది. అవిశ్వాస తీర్మానం వీగిపోయిందంటూ ప్రభుత్వం కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేసి ఐదు రోజులు గడవకముందే తీర్మానం నెగ్గిందంటూ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు ఆర్మూర్ మున్సిపాలిటీలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నెల 19లోపు నూతన ఛైర్ పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయాలని అప్పటి వరకు వైస్ ఛైర్మన్‌కు ఛైర్ పర్సన్ బాధ్యతలు ఇవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

అసలు ఏం జరిగిందంటే..

ఛైర్‌పర్సన్ వినీతపై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు 2023 డిసెంబర్ 12న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ కలెక్టర్‌కు నోటీస్ ఇచ్చారు. దీంతో జనవరి 4న అవిశ్వాస తీర్మానం సమావేశం నిర్వహించనున్నట్లు 15 రోజుల ముందుగా ఆర్డీవో వినోద్ కుమార్ కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేశారు. డిసెంబర్ 29న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా దరఖాస్తు చేసుకున్నారు. అప్పటికే కౌన్సిలర్లకు నోటీసులు ఇవ్వడంతో ఎమ్మెల్యేకు ఓటు హక్కు లేదనే ప్రచారం జరిగింది. ఈ క్రమంలో 36 మంది కౌన్సిలర్లలో 2/3 అంటే 24 మంది కౌన్సిలర్లతో పాటు ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అవిశ్వాస తీర్మానం సమావేశానికి హాజరయ్యారు. ఇందులో 24 మంది కౌన్సిలర్లు తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశారు. అధికారులు అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ప్రకటించారు. ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఉన్న ఎమ్మెల్యే ఓటు వేయకపోవడంతో తీర్మానం వీగిపోయినట్లు ప్రకటించాలని ఛైర్‌పర్సన్ హైకోర్టును ఆశ్రయించారు. కౌన్సిలర్లు సైతం హైకోర్టును ఆశ్రయించగా వినీత పిటిషన్‌ను న్యాయమూర్తి జనవరి 11న కొట్టి వేశారు. అయినా రాజకీయ పలుకుబడితో వినీత వర్గీయులు మరో ఎత్తుగడ వేశారు. ఎమ్మెల్యే ఓటు వేయని కారణంగా అవిశ్వాసం వీగిపోయినట్లు ఈ నెల 3న ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ఆధారంగా ఛైర్‌పర్సన్‌గా వినీత మళ్లీ బాధ్యతలు స్వీకరించారు.

న్యాయమూర్తి అసహనం

పండిత్ వినీత ఈ నెల 5న ఛైర్‌పర్సన్‌గా తిరిగి బాధ్యతలు స్వీకరించడంతో ప్రత్యర్థి వర్గం హైకోర్టును ఆశ్రయించింది. పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి గతంలో ఇలాంటి కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఆధారంగా చేసుకొని ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. జనవరి 11న వినీత స్టే కోసం వేసిన రిట్ పిటిషన్‌ను కొట్టి వేసినప్పుడే న్యాయమూర్తి అవిశ్వాస తీర్మానంపై స్పష్టతనిచ్చారు. మున్సిపాలిటీలో ఉన్న మొత్తం ఓట్లలో 2/3 అంటే 36 మంది కౌన్సిలర్లలో 24 మందిని కోరంగా గుర్తించి అవిశ్వాస తీర్మానం సమావేశం నిర్వహించాలి. ఎక్స్ అఫిషియోగా ఎమ్మెల్యే ఓటును పరిగణలోకి తీసుకున్న పక్షంలో 37 ఓట్లు అవుతాయి. అందులో 2/3 అంటే 25 మందిని కోరం సభ్యులుగా తీసుకొని సమావేశం నిర్వహించాలి. అవిశ్వాస తీర్మానం సమావేశంలో కోరం సభ్యులు 25 మందిలో 2/3 అంటే 17 మంది కౌన్సిలర్లు అనుకూలంగా ఓటు వేస్తే అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు అవుతుంది. ఆర్మూర్‌లో 24 మంది కౌన్సిలర్లు అనుకూలంగా ఓటు వేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లేనని న్యాయమూర్తి పేర్కొన్నట్లు సమాచారం. జనవరి 11 నాటి తీర్పులోనే స్పష్టంగా తెలిపినప్పటికీ ప్రభుత్వం అవిశ్వాస తీర్మానం వీగిపోయిందంటూ ఉత్తర్వులు జారీ చేయడంపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఎకో టూరిజంకు స్థల పరిశీలన



ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- జీజీ నడ్కుడ వద్ద రిసార్ట్‌లు, బోటింగ్, వ్యూ పాయింట్లు
- రాష్ట్ర ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఎఫ్‌వో రంజిత్ నాయక్

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం జీజీ నడ్కుడ వద్ద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో ఎకో టూరిజం ఏర్పాటు కోసం అధికారులు మరోసారి స్థల పరిశీలన చేశారు. శుక్రవారం రాష్ట్ర ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఎఫ్‌వో రంజిత్ నాయక్, జిల్లా డీఎఫ్‌వో వికాస్ మినాతో కలిసి బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని సందర్శించారు. ఇక్కడ పచ్చిక బయళ్లతో పాటు విదేశీ పక్షులు, జింకల సందండి నెలకొనడంతో పర్యాటక ప్రాంతంగా ఏర్పడింది. దీంతో ఇక్కడ ఎకో టూరిజం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం గత కొన్ని నెలల క్రితం స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీజీ నడ్కుడ,గాదేపల్లి వద్ద 18 ఎకరాలు కేటాయించగా, ఇటీవల ఇరిగేషన్ అధికారులు సర్వే కూడా పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఫారెస్టు కార్పొరేషన్ ఉన్నతాధికారులు మరోసారి స్థల పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి రైతుల భూములు ఎక్కడి వరకు ఉన్నాయో తెలుసుకున్నారు. డీఎఫ్‌వో రంజిత్ నాయక్ మాట్లాడుతూ... రైతుల భూములకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎకో టూరిజం ఏర్పాటు చేస్తామన్నారు. ఐదెకరాల్లో వ్యూ పాయింట్లు, సందర్శకులు ఉండేందుకు రిసార్ట్‌లు, హోటళ్లు, బోటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇవి ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని, స్థానిక గ్రామస్తులకు కూడా ఉపాధిని కల్పిస్తామన్నారు. దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో ఎకో టూరిజం ఏర్పాటు చేయాలని అంచనా వేస్తున్నామన్నారు. ఇందుకోసం త్వరలోనే ఆర్కిటెక్చర్‌ను పిలిచి ప్లాన్‌ను తీయిస్తామన్నారు. ఇదే సమయంలో వన్య ప్రాణులకు హాని కలుగకుండా అన్ని విధాలుగా చర్యలు చేపడుతామన్నారు. గ్రామస్తులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కూడా కల్పిస్తామన్నారు. వీరి వెంట ఎకో టూరిజం రేంజ్ ఫారెస్ట్ అధికారి శ్రీనివాస్, డిప్యూటీ ఫారెస్టు రేంజ్ అధికారి సుధాకర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

రుణమాఫీకి మోక్షం లభించేనా?

- నేడు బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న ఆర్థికమంత్రి
- కేటాయింపులు జరిపితేనే రైతుల ఆశలు తీరేది



మోర్తాడ్: రుణమాఫీకి బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని అన్నదాతలు ఆశతో ఎదురు చూస్తున్నారు. అసెంబ్లీలో శనివారం ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రూ.రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత రుణ మాఫీపై పలుమార్లు సమీక్ష నిర్వహించారు. రుణ మాఫీ కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులను సేకరించే ఆలోచన చేస్తున్నట్లు ఒక దశలో వార్తలు వచ్చాయి. శనివారం ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో రుణమాఫీ కోసం కేటాయింపులు ఎంత మేరకు ఉండబోనున్నాయనే అంశంపై చర్చ జరుగుతోంది.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రుణమాఫీ ఆశించిన విధంగా జరగలేదు. 2018లో బీఆర్‌ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రుణ మాఫీకి సంబంధించి జిల్లాలో 2,91,188 మందికి రూ.1,790 కోట్లు మాఫీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. నిధులు సకాలంలోను, సక్రమంగా కేటాయించని కారణంగా 99,418 మందికి రూ.490.72 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. మెజారిటీ రైతులకు మాఫీ సొమ్ము అందకపోవడంతో అసంతృప్తితో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యవసాయ శాఖ లెక్కలు తీయగా జిల్లాలో 2,12,361 మంది రైతులు రూ.895.76 కోట్లు రుణం తీసుకున్నట్లు తేలింది. గతంలో రుణాలు తీసుకొని బ్యాంకులకు బకాయిలు చెల్లించని వారి సంఖ్య ఇంకా ఎక్కువగా ఉంటుందని బ్యాంకర్లు చెబుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందనే ఆశతో అనేక మంది సకాలంలో బ్యాంకుల్లో పంట రుణాలను రెన్యువల్ చేసుకోలేదు. అలాంటి వారందరు బ్యాంకర్ల దృష్టిలో డిఫాల్టర్లుగా ఉండిపోయారు. రుణమాఫీ విషయంలో ఈ ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలను జారీ చేస్తుందోననే ఆసక్తి రైతుల్లో ఉంది.

ఇందిరమ్మ ఇళ్లకు..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం సొంతంగా స్థలం ఉండి ఇంటిని నిర్మించుకునే వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.మూడు లక్షల సాయం చేస్తామని ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించింది. ఒక్కో ఇంటి నిర్మాణం కోసం రూ.ఐదు లక్షల సాయం అందిస్తామని వెల్లడించింది. గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎన్ని నిధులు కేటాయిస్తారో అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో దాదాపు 27వేల మంది సొంత స్థలంలో ఇంటిని నిర్మించుకోవడానికి గృహలక్ష్మి కింద గతంలో దరఖాస్తు చేసుకున్నారు.

నిధులు ఇవ్వాలి



రైతుల పంట రుణాల మాఫీ కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. ఎంతో మంది రైతులు రుణ మాఫీ కోసం నిరీక్షిస్తున్నారు. రైతుల ఆశలను వమ్ము చేయకుండా కేటాయింపులు జరపాలి.

– గడ్డం లింగారెడ్డి, రైతు నాయకుడు, గుమ్మిర్యాల్

హామీ నిలబెట్టుకోవాలి



పంట రుణాలను మాఫీ చేసి ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలి. లేకుంటే ఆందోళన తప్పదు. రైతులు ఎంతో ఆశతో రుణమాఫీ జరుగుతుందని ఎదురు చూస్తున్నారు.

– కె చిన్న రాజేశ్వర్, రైతు, మోర్తాడ్

డిమాండ్‌కు అనుగుణంగా ఎర్రజొన్న ధర

- సీడ్ కంపెనీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- క్వింటాలుకు రూ.3500లకు తగ్గకుండా చెల్లిస్తామని ట్రేడర్ల హామీ



ట్రేడర్లు, వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సుభాష్‌నగర్: ఎర్రజొన్న కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ రేటుకు అనుగుణంగా ధర చెల్లించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సీడ్ కంపెనీల ప్రతినిధులకు సూచించారు. ఎర్రజొన్న దిగుబడులు చేతికందుతున్న నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ యాదిరెడ్డితో కలిసి వ్యవసాయ అధికారులు, విత్తన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. రైతులతో కుదుర్చుకున్న బై బ్యాక్ ఒప్పందానికి కట్టుబడి కొనుగోళ్లు జరగాలన్నారు. ఒకవేళ రైతులు బయట మార్కెట్‌లో ఎక్కువ ధరకు ఇతర ట్రేడర్లకు పంట అమ్ముకోవాలని భావిస్తే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని సూచించారు. ఎర్రజొన్నను ఢిల్లీ, పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తామని, అక్కడ పశువులకు దాణాగా వినియోగిస్తారని సీడ్ కంపెనీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మార్కెట్‌లో పంటకు ఆశించిన ధర పలుకుతోందని తెలిపారు. పంట వెరైటీలను బట్టి క్వింటాలుకు రూ.3,500 నుంచి రూ.4,300 వరకు ధర లభిస్తుండగా, తాము కూడా రైతులతో బై బ్యాక్ ఒప్పందాలు కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. ఇప్పుడిప్పుడే పంట కోతలు ప్రారంభమయ్యాయని, మరో పక్షం రోజుల్లో పెద్ద ఎత్తున దిగుబడులు చేతికందుతాయని తెలిపారు. సీజన్ చివరి దశ వరకు కూడా క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.3500 వరకు చెల్లిస్తామని ట్రేడర్లు హామీ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను మోసగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఏడీఏలు, ఏవోలు, విత్తన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఏపీడీ ఆత్మహత్య



సంజీవ్‌కుమార్ (ఫైల్)

నిజామాబాద్ రూరల్: అనారోగ్య కారణాలతో డీఆర్‌డీఏలో ఏపీడీగా పని చేస్తున్న సంజీవ్‌కుమార్(57) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ ఎస్సై మహేశ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. సంజీవ్‌కుమార్ కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏపీడీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయనకు భార్య సింధు, కుమారుడు ఉన్నారు. సంజీవ్‌కుమార్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. 15 రోజుల క్రితం ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఈ క్రమంలో శుక్రవారం కార్యాలయానికి వెళ్లిన ఆయన ఆరోగ్యం బాలేదని ఇంటికి వెళ్లాడు. తిరిగి విధులకు రాకపోవడంతో సంబంధిత శాఖకు చెందిన డ్రైవర్ ఇంటికి వెళ్లి పిలవగా ఎంతకు తలుపు తీయలేదు. దీంతో డ్రైవర్ ఏపీడీ భార్యకు సమాచారం అందించాడు. ప్రైవేట్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆమె వచ్చి కిటికీలో నుంచి చూడగా సంజీవ్‌కుమార్ ఇంట్లో చున్నీతో ఉరి వేసుకొని ఉన్నాడు. తలుపులు బద్దలుకొట్టి కిందికి దించగా అప్పటికే సంజీవ్‌కుమార్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

రెండేళ్ల క్రితం పదోన్నతి

జిల్లాలో ఎంపీడీవోగా సంజీవ్‌కుమార్ అందరికీ సుపరిచితులు. గతంలో అనంతపూర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆయన పనిచేశారు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి, మెపాల్, నిజామాబాద్ రూరల్ మండలాల్లో ఎంపీడీవోగా సేవలందించి రెండేళ్ల క్రితం జిల్లా ఏపీడీగా పదోన్నతి పొందారు. అందరితో కలుపుగోలుగా ఉండే సంజీవ కుమార్ ఆత్మహత్యను తోటి ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న ఎంఈడీ 1, 2, 3వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్, 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ, ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో జరిగిన పరీక్షకు 40 మందికి 40 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



డిచ్‌పల్లి: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని మిట్టాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బుక్య దేవేందర్ ఎంపికైనట్లు హెచ్‌ఎం సుశీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈనెల 10, 11వ తేదీల్లో హన్మకొండ జిల్లా ధర్మసాగర్‌లో నిర్వహించే 9వ రాష్ట్ర జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థి దేవేందర్‌ను హెచ్‌ఎం సుశీల్‌కుమార్, పీఈటీ గంగామోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

సిరికొండ విద్యార్థి ఎంపిక

సిరికొండ: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సిరికొండ సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థి జి శ్రీవర్ధన్ ఎంపికయ్యాడు. ఈ నెల 10 నుంచి హన్మకొండలో నిర్వహించే అండర్-18 పోటీల్లో పాల్గొంటాడన్నారు. అనంతరం విద్యార్థి శ్రీవర్ధన్‌ను ప్రిన్సిపాల్ నర్సయ్య శుక్రవారం అభినందించారు. మైలారం మాజీ ఉప సర్పంచ్ సత్యానంద్, ఉపాధ్యాయులు గంగారెడ్డి, అనిల్, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు టీజీసెట్ ప్రవేశ పరీక్ష

డిచ్‌పల్లి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు నిర్మల్‌లో గురుకుల టీజీసెట్-2024 ప్రవేశ పరీక్షను ఆదివారం నిర్వహించనున్నట్లు సంస్థ ఆర్‌సీవో కె.అలివేలు, డీసీవో బి.సంగీత శుక్రవారం తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఈ ప్రవేశ పరీక్షల నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిజామాబాద్‌లో 17, కామారెడ్డిలో 11, నిర్మల్‌లో 16 పరీక్షా కేంద్రాల్లో ఈ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. హాల్‌టికెట్లను టీజీసెట్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

మొక్కజొన్న విత్తనాల్లో నాణ్యతాలోపం

- 50 ఎకరాల్లో ఎండిపోతున్న మొక్కలు
- ఆందోళనలో రైతులు
- చేతులెత్తేసిన వ్యవసాయ అధికారులు



ఎండిపోయిన మొక్క జొన్న పంట

బిచ్కుంద(జుక్కల్) : మార్కెట్‌లో నకిలీ విత్తనాలను అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడానికి ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు, ఎన్ని నిబంధనలు పెట్టిన ప్రయోజనం లేకుండా పోతుంది. దుకాణాల్లో తనిఖీలు చేయాలని పోలీసు, వ్యవసాయ రెండు శాఖల అధికారుల సమన్వయంతో టాస్క్‌ఫోర్సు బృందాలు నియమించి దుకాణాలపై దాడులు చేసిన నకిలీ విత్తనాలు మార్కెట్‌లో చెలామణి అవుతునే ఉన్నాయి. మండలంలో పుల్కల్ గ్రామానికి చెందిన 30 మంది రైతులు రెండు నెలల క్రితం 50 ఎకరాలలో గంగా కావేరి కంపెనీకి చెందిన జీ.కే 3155 రకం మొక్కజొన్న విత్తనాలు వేశామని, కాని నాణ్యత లేని నకిలీ విత్తనాలతో మొక్కలు ఎర్రగా మారి ఎండిపోయిందని రైతులు ఆరోపిస్తున్నారు. నాణ్యత లేకపోవడంతో మొక్క కాండం నుంచే ఆకులు, పాల దశలో ఉన్న కంకులు పూర్తిగా మాడిపోయాయని రైతులు కంటితడి పెట్టుకుంటున్నారు. బిచ్కుంద, పెద్దకొడప్‌గల్‌లో ఉన్న విత్తనాల దుకాణం నుంచి మొక్కజొన్న విత్తనాలను రైతులు తీసుకొచ్చారు. మంచి విత్తనాలు ఉన్నాయని దుకాణదారులు నమ్మించి రైతులకు అంటగట్టారు. వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేసిన భూమిలో పోషకాల లోపం ఉందని చెప్పి అధికారులు దుకాణ యజమానులకే వత్తాసు పలుకుతున్నారని రైతులు అంటున్నారు. ఇతర కంపెనీ విత్తనాల పంటలు బాగున్నాయని, 50 ఎకరాలు జీ.కే 3155 రకం విత్తనాలు వేసిన రైతులకే ఈ సమస్య ఉందని చెప్పినా తమకేమి తెలియదని అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. పెట్టుబడి కోసం ఎకరాకు రూ. 20 వేలు ఖర్చయిందని వారు వాపోతున్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి కంపెని ప్రతినిధులతో మాట్లాడి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

పొంతనలేని సమాధానాలు

రైతులు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి ఎండిపోయిన మక్క పంట గోడును వినిపించారు వెంటనే స్పందించిన మాజీ డీసీసీబీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి రుద్రూర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పంటక్షేత్రాలను సందర్శించి ఎండిన మొక్కజొన్న పరిశీలించారు. ఎక్కడ లోపం ఉందో తెలియక నామ మాత్రంగా పరిశీలించి పొంతన లేని సమాధానం చెప్పి వెళ్లిపోయారని రైతులు అంటున్నారు.

నాణ్యత లేని విత్తనాలు



బిచ్కుంద, పెద్దకొడప్‌గల్‌లో ఉన్న విత్తన షాప్ నుంచి 30 మంది రైతులు విత్తనాలు తీసుకున్నాం. నకిలీ విత్తనాలు అంటగట్టారు. రెండు ఎకరాలు సాగు చేసిన ఎర్రగా మారి ఎండిపోయింది. పెట్టుబడి రాక రాని పరిస్థితి. దుకాణా యజమానులపై ఎమ్మెల్యే, కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.

– పండరి, రైతు, పుల్కల్


చిట్టెడు గింజలు చేతికొచ్చేట్లు లేవు



గంగా కావేరి జీకే నంబర్ 3155 మొక్కజొన్న విత్తనాలు వేసి నష్టపోయాం. గింజలు పాల దశలో ఉన్నాయి. పంట పూర్తిగా ఎండిపోయింది. చిట్టెడు గింజలు చేతికి రాకుండా ఉంది. ఇతర కంపెనీ విత్తనాల పంటలు బాగున్నాయి. 3155 రకం విత్తనాలు నకిలీ ఉన్నాయి. వ్యవసాయ అధికారులు పొంతన లేని సమాధానం చెబుతున్నారు.

– హన్మాండ్లు, రైతు, పుల్కల్

ఎస్‌వో వేధింపులు భరించలేకపోతున్నా..





ఎస్‌వో వేధింపులకు గురిచేస్తున్నారంటూ పీఈటీ పెట్టిన వాట్సాప్ స్టేటస్

- మానసికంగా హింసిస్తున్నారని కేజీబీవీ పీఈటీ వాట్సాప్ స్టేటస్
- బీపీ ఎక్కువై ఆస్పత్రి పాలైన పీఈటీ
- ఆరోపణలు అవాస్తవమంటున్న ప్రిన్సిపాల్

దోమకొండ: ఎస్‌వో మేడం నన్ను బ్రతకనివ్వడం లేదు.. మానసికంగా హింసిస్తున్నారంటూ మండలంలోని సీతారాంపల్లి కేజీబీవీకి చెందిన కాంట్రాక్ట్ పీఈటీ వీణ వాట్సాప్ స్టేటస్ గురువారం కలకలం రేపింది. పీఈటీ వీణ తెలిపిన వివరాల ప్రకారం.. గత నాలుగేళ్లుగా కేజీబీవీలో కాంట్రాక్ట్ పీఈటీగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రెండేళ్ల క్రితం జరిగిన హోలీ వేడుకల్లో సిబ్బంది కోరిక మేరకు తాను కల్లు తీసుకొచ్చి వారికిచ్చినట్లు చెప్పారు. అదేవిధంగా పిల్లలకు రాత్రి మిగిలిన అన్నం ఉదయం అందిస్తుండడంపై ప్రిన్సిపాల్ మమతను ప్రశ్నించడంతో తనపై కక్ష పెంచుకుందన్నారు. రెండేళ్ల నుంచి ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ నన్ను మానసిక క్షోభకు గురిచేస్తున్నట్లు తెలిపారు. కేజీబీవీలోని పిల్లలు, ఉపాధ్యాయులు, సిబ్బందితో ఎవరితోనూ నాతో మాట్లాడనివ్వకుండా అడ్డు పడుతున్నారని పేర్కొన్నారు. వీరి వేధింపులు భరించలేక రెండు రోజుల క్రితం బీపీ ఎక్కువై మైండ్‌స్ట్రోక్ రావడంతో కామారెడ్డిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. తనకు ఏదైనా జరిగితే ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ కారణమని పేర్కొన్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా పీఈటీ వీణ కళాశాల ఆవరణలోకి కల్లు తెచ్చుకుని సేవిస్తుందన్నారు. ఈ విషయమై డీఈవో, ఉన్నతాధికారులకు తెలియజేయడంతో వారు విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. కల్లు సేవించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు ఆడపిల్లలపై ప్రభావం పడుతుందని జిల్లా అధికారులకు తెలిపినందుకు పీఈటీ తనపైనే కక్షగట్టి ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఈ విషయమై బీబీపేట పీఎస్‌లో పీఈటీపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

తెయూ హాస్టల్ విద్యార్థినులకు అస్వస్థత



విద్యార్థినుల ఆస్పత్రికి తరలింపు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ బాలికల వసతి గృహం విద్యార్థినులు ముగ్గురు గురువారం అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం జరుగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షలకు ఉదయం విద్యార్థులు హాజరయ్యారు. వారిలో ఓ విద్యార్థినికి ఫిట్స్ వచ్చాయి. మరో విద్యార్థిని ఆహారం తీసుకోకపోవడంతో కళ్లు తిరిగి కిందపడిపోయింది. గమనించిన సిబ్బంది వెంటనే వారిని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో కిడ్నీ స్టోన్‌తో బాధపడుతున్న మరో విద్యార్థిని తాను కూడా ఆస్పత్రికి వెళ్తానని చెప్పగా ముగ్గురిని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. అప్పటికే వర్సిటీ అధికారులు విద్యార్థినుల కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వారు తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో ఎవరికైనా అనారోగ్యం వస్తే కనీసం ఆస్పత్రికి తీసుకెళ్లడానికి అంబులెన్స్ సౌకర్యం లేదని ఆరోపించారు. క్యాంపస్‌లో హెల్త్ సెంటర్ ఉన్నా అందుబాటులో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ విషయమై రిజిస్ట్రార్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి హెల్త్ సెంటర్‌లో వైద్యులు, సిబ్బందిని నియమించాలని అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గంగారాం



ఇన్‌చార్జి చైర్మన్ గంగారాంను సన్మానిస్తున్న డైరెక్టర్లు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి సొసైటీ వైస్ చైర్మన్ కుమ్మరి చిన్నగంగారాం శుక్రవారం ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 6న చైర్మన్ గజవాడ జైపాల్ తన పదవికి రాజీనామా చేయడంతో డీసీవో ఆదేశాల మేరకు వైస్ చైర్మన్ ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్ అధ్యక్షతన డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. వీలైనంత త్వరగా చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని కోరుతూ సభ్యులు తీర్మానం చేశారు. తీర్మాన లేఖను డీసీవో కార్యాలయానికి పంపిస్తామని సీఈవో కిషన్ తెలిపారు. ఇన్‌చార్జి చైర్మన్ బాధ్యతలు స్వీకరించిన కుమ్మరి చిన్న గంగారాంను డైరెక్టర్లు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బూస చిన్న నర్సింహులు, బాలమల్ల సాయిలు, దాసరి రమేశ్, రాంచందర్ గౌడ్, అంకం లత, తేనేటి రాజమ్మ, లంబాని హరిచంద్, పడిగెల గంగారెడ్డి, ఏలేటి సతీశ్‌రెడ్డి, ఎడ్ల శాంసన్, సిబ్బంది ఓస సాయిలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డీసీవో సింహాచలంపై విచారణ చేపట్టాలి

కామారెడ్డి అర్బన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీవో సింహాచలం అవినీతిపై విచారణ చేపట్టాలని కోరుతూ రాష్ట్ర సహకార రిజిస్ట్రార్‌కు రాజంపేట సొసైటీ చైర్మన్ అశోక్ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వరి ధాన్యం కొనుగోళ్లపై కమీషన్ చెక్కులు ఇచ్చినప్పుడు రెండు శాతం కమీషన్ తీసుకున్నారని, అలాగే ఉమ్మడి జిల్లాలోని 714 వడ్ల కొనుగోలు కేంద్రాలలో ఏర్పాటు చేసిన ఒక్కో ఫ్లెక్సీకి రూ. 600 కాగా డీసీవో రూ. 2500 వరకు సొసైటీల నుంచి వసూలు చేశారని ఆరోపించారు. డీసీవోను సస్పెండ్ చేసి విచారణ చేపట్టి సహకార సంఘాలను కాపాడాలని కోరారు. వ్యవసాయ శాఖ మంత్రి, వ్యవసాయ, సహకార ముఖ్యకార్యదర్శులకు డీసీవోపై ఫిర్యాదు చేసినట్లు అశోక్ పేర్కొన్నారు.

19 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని బీఈడీ రెండవ సంవత్సరం 3వ సెమిస్టర్ పరీక్ష ఫీజును ఈ నెల 19 వరకు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ శుక్రవారం తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 20 వరకు, రూ.200 అపరాధ రుసుముతో ఈ నెల 21 వరకు, రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 22వరకు పరీక్షఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు సంబంధిత కళాశాల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

గన్నారంలో కిడ్నాపర్ల కలకలం



ఇందల్వాయి: మండలంలోని గన్నారంలో శుక్రవారం పిల్లలను కిడ్నాప్ చేసే వాళ్లు తిరుగుతున్నారన్న వార్త గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో కలకలం రేపింది. గ్రామంలో అనుమానస్పదంగా తిరుగుతున్న ఓ మహిళ, ఓ వ్యక్తిని గ్రామస్తులు బంధించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించారు. విచారణలో వారు సిరికొండ మండల కేంద్రానికి చెందిన గోసంగి సంఘ సభ్యులమని తెలిపారు. ఇందల్వాయి పోలీసు సిబ్బంది సిరికొండ ఎస్సైకి సమాచారం అందించి వివరాలు సేకరించారు. తమ అదుపులో ఉన్నది కిడ్నాపర్లు కాదని నిర్ధారించుకున్న పోలీసులు వారి వివరాలు సేకరించి వదిలి పెట్టారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌హెచ్‌వో మోతీరాం సూచించారు.

మాక్లూర్‌లో చైన్ స్నాచింగ్

మాక్లూర్: మండల కేంద్రంలోని ఆర్టీసీ కాలనీలో శుక్రవారం చైన్‌స్నాచింగ్ జరిగినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. కాలనీకి చెందిన ప్రమీల తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును దొంగిలించినట్లు పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

దుర్కిలో వృద్ధురాలు మృతి



నస్రుల్లాబాద్: మండలంలోని దుర్కిలో ఓ వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై లావణ్య శుక్రవారం తెలిపారు. దుర్కిలోని రైస్‌మిల్ ఎదుట ఓ వృద్ధురాలు మృతి చెందినట్లు సమాచారం అందడంతో ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టగా వృద్ధురాలి వద్ద ఆధార్‌కార్డు లభించిందన్నారు. అందులో మృతురాలిని జుక్కల్‌కు చెందిన దాసరి పీరవ్వ(50)గా గుర్తించినట్లు పేర్కొన్నారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

అక్రమ నిర్మాణం సీజ్



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలో నిబంధనలు అతిక్రమించి చేపడుతున్న ఓ భవన నిర్మాణాన్ని మున్సిపల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం సీజ్ చేశారు. మహాలక్ష్మికాలనీలో మూడంతస్తుల భవన నిర్మాణానికి అనుమతి తీసుకొని ఎలాంటి సెట్‌బ్యాక్ లేకుండా ఐదంతస్తుల భవన నిర్మాణం చేపడుతున్నారు. దీంతో ఫిర్యాదు మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు పరిశీలించి భవనాన్ని సీజ్ చేశారు. మున్సిపల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు టీపీవో హరీశ్, సర్వేయర్ షికారి రాజు, ఆర్ఐ అశోక్‌సింగ్, అగ్నిమాపక శాఖ అధికారి మధుసూదన్, ఎస్సై గంగాధర్ ఉన్నారు.

చెట్టును ఢీకొన్న కంటైనర్

- స్టీరింగ్‌లో ఇరుక్కుని డ్రైవర్ మృతి



భిక్కనూరు: మండల సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై సాయికుమార్ శుక్రవారం తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ జిల్లాకు చెందిన అనిల్‌కుమార్ బిందు (38) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కడప నుంచి నోయిడాకు సీసీ కెమెరాల లోడ్‌తో అనిల్‌కుమార్ లారీ కంటైనర్‌లో వెళ్తుండగా భిక్కనూరు బైపాస్ సమీపంలో ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో అనిల్‌కుమార్ స్టీరింగ్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొబైల్ షాప్‌లో అగ్నిప్రమాదం



ఖలీల్‌వాడి: నగరంలోని హైటెక్ మొబైల్ షాప్‌లో విద్యుదాఘాతం సంభవించింది. శుక్రవారం ఉదయం దుకాణం నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన స్థానికులు నిర్వాహకుడికి సమాచారం అందించారు. ఈ ఘటనలో దుకాణంలోని ఫోన్లు, కంప్యూటర్లు, సీసీ కెమెరాలు అగ్నికి ఆహుతి అయినట్లు దుకాణ నిర్వాహకుడు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ

బోధన్‌టౌన్: పట్టణంలోని నర్సాపూర్ శివారులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాయిల్స్‌ను గుర్తు తెలియని దుండగులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. విద్యుత్ శాఖ ఏఈ ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరయ్య తెలిపారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: జీవితంపై విరక్తితో ఒకరు గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి-ఉప్పల్‌వాయి రైల్వేస్టేషన్ల మధ్య శుక్రవారం చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే ఎస్సై తావునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని బీడీ వర్కర్స్ కాలనీకి చెందిన హరీశ్‌కుమార్(33) గత పదేళ్లుగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రుల్లో చూయించినా నయం కావడం లేదు. దీంతో జీవితంపై విరక్తితో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై..

ధర్పల్లి: మద్యానికి బానిసై ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మైలారంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అల్లూరి పెద్దగంగారాం(62) ప్రతి రోజూ మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. తాగిన మత్తులో ప్రతిసారి ఆత్మహత్యకు యత్నించేవాడు. ఎప్పటిలాగే గురువారం రాత్రి మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవపడి తన గదిలో నిద్రించాడు. ఉదయం బయటకు రావడంతో గమనించిన కుటుంబీకులు విగత జీవిగా కనిపించాడు. తాగిన మత్తులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పక్షవాతం నయం కావడం లేదనే మనస్తాపంతో..

కమ్మర్‌పల్లి: పక్షవాతానికి గురైన ఓ వ్యక్తి నయం కావడం లేదని మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మర్‌పల్లికి చెందిన చిరునాంజి బాలకిషన్(54) వడ్రంగితో పాటు టింబర్ డిపో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఏడాది క్రితం పక్షవాతం రావడంతో రెండు కాళ్లు, ఎడమ చేయి సరిగా పడిచేయడం లేదు. ఎన్ని మందులు వాడినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకన్నాడు. మృతుడి భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక యువకుడు..



శ్రీకాంత్ మృతదేహం

నస్రుల్లాబాద్: కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సంగం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బదావత్ శ్రీకాంత్(25) టైల్స్ పని చేస్తు జీవిస్తుంటాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో హనుమాన్ ఆలయ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దొరకని గణేశ్ ఆచూకీ

- నీటి ప్రవాహం తగ్గకపోవడంతో గాలింపు చర్యలకు విఘాతం
- ఆందోళనలో కుటుంబీకులు



గణేశ్ (ఫైల్)

మోర్తాడ్: కాకతీయ కాలువలో పడి గల్లంతైన మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ వాసి రొయ్యల గణేశ్ ఆచూకీ ఇంకా లభించలేదు. గణేశ్ సోదరుడు గౌతం కాలకృత్యాలు తీర్చుకునేందుకు కాలువలోకి దిగి నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా రక్షించబోయిన గణేశ్ గల్లంతైన విషయం విధితమే. గురువారం నుంచి శుక్రవారం రాత్రి వరకు కాలువలో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. నీటి ప్రవాహాన్ని నిలపివేయాలని గ్రామ ప్రజాప్రతినిధులు, పోలీసులు నీటిపారుదల ఉన్నతాధికారులకు విన్నవించారు. నీటి ప్రవాహం తగ్గితేనే గణేశ్ ఆచూకీ లభ్యమవుతుందని గజఈతగాళ్లు పేర్కొంటున్నారు. గణేశ్‌కు గత ఏడాది వివాహం జరుగగా రెండు నెలల కుమార్తె ఉంది. నీటి విడుదలను నిలపివేయకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం కాలువలో మరోసారి గాలింపు చర్యలు చేపడుతామని ఏర్గట్ల ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు.

సంతలో మహిళతో అసభ్య ప్రవర్తన

- కిడ్నాపర్లుగా భావించి దాడి..
- ఇటుకబట్టి కార్మికులుగా నిర్ధారించిన పోలీసులు

నవీపేట: వారాంతపు కూరగాయల సంతకు వచ్చిన మహిళతో ముగ్గురు యువకులు తాగిన మైకంలో అసభ్యంగా ప్రవర్తించారు. వారి వేషధారణలో అనుమానం వచ్చిన గ్రామస్తులు కిడ్నాపర్లుగా భావించి చితకబాదారు. మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన ముగ్గురు కార్మికులు జగదీశ్, భరత్, అశోక్ నెల రోజుల నుంచి మండలంలోని మహంతం శివారులోని ఇటుకబట్టిలో కార్మికులుగా పనిచేస్తున్నారు. శుక్రవారం వారాంతపు సంత కావడంతో మండల కేంద్రానికి వచ్చిన ముగ్గురు మద్యం సేవించారు. మత్తులో సంతలోకి వెళ్లి ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించి, చేయిని తాకారు. దీంతో ఆగ్రహించిన తోటి వినియోగదారులు, గ్రామస్తులు వారిని నిలదీయగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. వీరి వేషధారణ భిన్నంగా ఉండడంతో చిన్న పిల్లల కిడ్నాపర్లుగా భావించిన గ్రామస్తులు కర్రలతో చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించగా, స్థానిక ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. ఇటుకబట్టి యజమాని పూచీకత్తుపై ముగ్గురు కూలీలను విడిచి పెట్టారు.

దాడులకు పాల్పడవద్దు..

అనుమానాస్పద వ్యక్తులపై విచక్షణ రహితంగా దాడులు చేయొద్దని ఎస్సై యాదగిరిగౌడ్ కోరారు. చిన్న పిల్లల కిడ్నాపర్లు గ్రామాల్లో తిరుగుతున్నారని సోషల్ మీడియా కథనాలు రావడంతో కొత్తవారిని అనుమానిస్తున్నారని పేర్కొన్నారు. అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



మోపాల్: మండలంలోని కంజర్, కులాస్‌పూర్ గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 29.62 క్వింటాళ్ల పీడీఎస్ బియాన్ని పోలీసుల సహకారంతో పౌరసరఫరాలశాఖ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. కంజర్‌లో 18.48 క్వింటాళ్లు, కులాస్‌పూర్‌లో 11.13 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రజల నుంచి కొనుగోలు చేసి నిల్వ ఉంచినట్లు విశ్వసనీయంగా సమాచారం రావడంతో పట్టుకున్నట్లు డీఎస్‌వో చంద్రప్రకాశ్ తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులను కేసుల నమోదుకు పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ప్రజా పంపిణీ బియ్యాన్ని సంబంధిత గ్రామాల రేషన్‌దుకాణాల్లో భద్రపర్చినట్లు డీఎస్‌వో తెలిపారు.

భిక్కనూరులో బైక్ చోరీ

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి చౌరస్తా నుంచి బైక్ చోరీకి గురైనట్లు ఎస్సై సాయికుమార్ శుక్రవారం తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన సర్దార్ దామ్మే అనే వ్యక్తి కుర్చీలు విక్రయించే వ్యాపారం చేస్తుంటాడు. నాలుగురోజుల క్రితం దామ్మెతో పాటు మరో నలుగురు అతని బంధువులు కుర్చీలు విక్రయించే వ్యాపారం మండల కేంద్రంలో చేస్తున్నారు. గురువారం రాత్రి దుండగులు బైక్‌ను చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.